క్లుప్తంగా

లబ్ధిదారులకు ఎల్‌ఓసీల అందజేత



నర్మెట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారికి మంజూరైన ఎల్‌ఓసీలను అందించినట్లు ఎంపీపీ తేజావత్ గోవర్ధన్ నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ హన్మంతాపూర్‌కు చెందిన ప్రజ్ఞాపురం యాదగిరి, ఇసుకభాయి తండాకు చెందిన మూల బిందు, బానోత్ భగవాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఎల్‌ఓసీలను మంజూరు చేయించారని తెలిపారు. అట్టి ఎల్‌ఓసీలను లబ్దిదారులకు అందించామన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌస్, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, సర్పంచ్ పగడాల విజయనర్సయ్య, బానోత్, అనిత మంగనియా, ముప్పిడి విజయప్రతాప్, ఎంపీటీసీ బానోత్ లలితసోమ్లా తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జేవీవీ కన్వీనర్ జ్యోతి శ్రీహరి ఆధ్వర్యంలో మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి బుధవారం చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు నాగరాజం, నాగభూషణం, రాములు, రవీందర్, యాకయ్య, యాదవరెడ్డి, జంపయ్య, లక్ష్మి, రేణుకతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పాలకుర్తి: రాఘవపురంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు రాగం రాజన్న కుమారు భరత్‌చందర్ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మండల ప్రచార కార్యదర్శి బైరు బార్గవ్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కడియం కావ్య..

రఘునాథపల్లి: వెల్ది గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రాసమల్ల యాకస్వామి ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కావ్య బుధవారం వెల్దికి చేరుకొని యాకస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థికసాయం అందజేశారు.

హామీలు అమలు చేయాలి

జఫర్‌గఢ్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతుబంధు, రుణమాఫీ, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. నాయకులు కూరపాటి చంద్రమౌళి, ఎండీ యాకుబ్‌పాష, బుచ్చయ్య, సమ్మయ్య, గట్టుమల్లు, ఎండి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పతంగుల ఆట



దేవరుప్పుల: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని చిన్నారులు ఆడే పతంగు ల ఆట పల్లెల్లో మొదలైంది. సింగరాజుపల్లిలో ని ప్రాథమిక పాఠశాల పక్క వ్యవసాయ క్షేత్రాల్లో విద్యార్థులు పతంగుల ఆట పోటీ పడుతూ స్నేహపూరిత వాతావరణం కనిపించింది.

మొదలైన సంక్రాంతి చకినాలు



చిల్పూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని చకినాల సందడి మొదలైంది. మండలంలోని మల్కాపూర్‌లో ఓ ఇంట్లో మహిళలు చకినాలు చేస్తూ బుధవారం కనిపించారు.

దరఖాస్తుల 'ఆన్‌లైన్' వేగవంతం చేయాలి



బచ్చన్నపేట: ఆన్‌లైన్ డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

బచ్చన్నపేట: ప్రజా పాలనలో స్వీకరించిన అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, రచనా మండలి సమాఖ్య భవనంలో దరఖాస్తుల ఆన్‌లైన్‌ను ప్రక్రియను జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో సులువైన పద్ధతిని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించామన్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 13, 500 దరఖాస్తులు వచ్చినాయని అన్నారు. రెండు సెక్టార్లుగా విభజించి 13 గ్రామాల చొప్పున దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కావాలి, కానీ సర్వర్ మొరాయిస్తుండడంతో ఆన్‌లైన్ ఆలస్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్లు ఇస్మాయిల్, బాలకృష్ణ, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన డాటా ఎంట్రీ

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల పథకాల అమలు కోసం స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో ఎంట్రీ చేసే ప్రక్రియ బుధవారం ముగిసింది. జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆదేశాల మేరకు పాలకుర్తి నియోజకవర్గ పర్యవేక్షకులు, డీపీఓ రంగాచారీ నేతృత్వంలో మండల అధికార యంత్రాంగం నిర్దేశిత సమయంలో మొత్తం 13,010 దరఖాస్తులను పూర్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు కె రాము, హుస్సేన్, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, తహసీల్దార్ హుస్సేన్, ఎంపిఓ సురేష్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, సిబ్బంది కృపాకర్‌రెడ్డి, మల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా సాధికారతపై అవగాహన



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఏసీపీ

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం కేతిడి నరసింహారెడ్డి అధ్యక్షతన బాలికా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ సుందరగిరి శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడుతూ బాలికలు ప్రతీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. సైబర్ ఇతర సమస్యలు ఉంటే పోలీసులకు తెలుపాలన్నారు. బాలికల వివక్ష, విమెన్ ట్రాఫికింగ్ తదితర సమస్యలు, వాటిని అధిగ మించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. చిల్పూరు ఎస్సై వినయ్‌కుమార్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, భుట్టవాండ్లతండా పాఠశాల హెచ్‌ఎం దారం శ్రీనివాస్, కోమళి, నరసింహరావు, లక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మి, రామూర్తి, కేకే మూర్తి, వనజారాణి, రమాదేవి, రమణకుమార్, సీఆర్‌సీ రవీందర్, కారోబార్ ఆనందంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం

ప్రభుత్వ పాఠశాలకు దూరం నుంచి నడుచుకుంటూ వచ్చే బాలికలను గుర్తించి వారికి సైకిళ్లు అందే విధంగా దారం శ్రీనివాస్ చేసిన కృషి అభినందనీయమని ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నడుచుకుంటూ వచ్చే ఐదుగురు విద్యార్థినులకు హనుమకొండ రోటరీ క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్ సైకిళ్లను అందజేయగా వాటిని ఏసీపీ పంపిణీ చేశారు.

ఘన్‌పూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

స్టేషన్‌ఘన్‌పూర్: డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం పోలీస్‌కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు, ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు సట్ల రాజుగౌడ్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘన్‌పూర్‌లో బుధవారం రాత్రి ముమ్మర తనిఖీలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్, బస్టాండ్, రైల్వేగేటు, వివేకానంద చౌరస్తా ప్రాంతాల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు, నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం వినతిపత్రం అందించారు. సీఎం సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారని ఇందిర తెలిపారు.

ఎన్నిక



జనగామ రూరల్: పట్టణంలోని బస్టాండ్ ఔట్ గేట్ ఆటో యూనియన్ నూతన కమిటీని బధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా బల్దె శ్రీశైలం, అధ్యక్షుడిగా నోముల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మంగ రాంచర్, కార్యదర్శిగా మజ్జిగ నరసింహ, సహాయ కార్యదర్శిగా కాసం శ్రావన్, కోశాధికారిగా మరాటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

టీఆర్‌వీకేఎస్ ఘన్‌పూర్ డివిజన్ కమిటీ..



రాజలింగం, అధ్యక్షుడు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కమిటీని బుధవారం ఘన్‌పూర్‌లో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కోట రాజలింగం (కొడకండ్ల లైన్‌మన్), వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మహమ్మద్ నహీమ్, సునీల్, ఉపాధ్యక్షులుగా సోమనాథం, బాలాజీ, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రామబ్రహ్మాచారి, సునీల్, కార్యదర్శిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా సంతోష్, లక్ష్మణ్, శ్యాం, రాజ్‌కుమార్, నరేందర్, కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా సాయిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజలింగం మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సహకరించిన వారందరికీ కతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చిలుముల కృష్ణ..



పాలకుర్తి టౌన్: బీఎస్పీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చిలుముల కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పాలకుర్తిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మరిపడగ చంద్రశేఖర్ తెలిపారు. బీఎస్పీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి కృషి చేస్తుండటంతో కృష్ణను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసీ మెంబర్ నీర్మాల రత్నం, పడమటింటి భాస్కర్, చెరిపెల్లి భాస్కర్, ఈదునూరి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు డ్రెస్‌ల పంపిణీ



వ్యాపారి మధును సత్కరిస్తున్న అధ్యాపకులు, చైర్మన్

జనగామ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డున ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 350 విద్యార్థినులకు ప్రముఖ వైట్ అండ్ వైట్ వ్యాపార వేత్త గజ్జి మధు బుధవారం రూ.4లక్షల విలువ చేసే డ్రెస్‌లు పంపిణీ చేశారు. కళాశాల చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ మంజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాపారి మధు ఐదేళ్లుగా విద్యార్థులకు క్వాలిటీతో కూడిన దుస్తులు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. సీడీసీ మెంబర్ బెలిదె శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



దయాకర్‌రావుతో బీఆర్‌ఎస్ శ్రేణులు

దేవరుప్పుల: హైదరాబాద్‌లో తలపెట్టిన బీఆర్‌ఎస్ రాష్ట్ర సమావేశాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు మండల ముఖ్య శ్రేణులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమిని విశ్లేషించుకొని ఇక ముందు జరిగే ప్రతీ ఎన్నికలో పార్టీ పూర్వవైభవం కోసం శ్రేణుల పాటుపడాలని సూచించారు. బీఆర్‌ఎస్ మండల నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేష్,వీరారెడ్డి దామోదర్ రెడ్డి, హన్మంతు, చింత రవి, ఎల సోమసుందర్, కొత్త జలంధర్‌రెడ్డి, గండిపెల్లి యాకయ్య,కూతాటి నర్సింహులు, సోమిరెడ్డి, జాకీర్, జోగు సోమనర్సయ్య, శీల తిరుమలేష్ ఉన్నారు.

ఘనంగా శ్రీరామయజ్ఞం

దేవరుప్పుల: కామారెడ్డిగూడెంలో వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ భక్తుల మాలధారణ పూర్తవుతున్న సందర్భంగా శ్రీరామ యజ్ఞం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ఆచార, కులదేవత సంప్రదాయలను గౌరవించాలన్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోరోజు శ్రీనివాస్, కొంగ సతీశ్, మారేపల్లి మురళి, పులిపంపుల సురేష్,గోరోజు వీరబ్రహ్మం, అజయ్, ప్రశాంత్‌లను నిర్వాహకులు సన్మానించారు. ఓడపెల్లి అంజయ్య, మాసంపెల్లి మహేందర్, చెన్నయ్య, అనిల్, చింత శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాకే రోడ్డు వేయాలి



కంకర లారీలను అడ్డుకున్న రైతులు

చిల్పూరు: కల్వర్టు నిర్మించకుండా బీటీ రోడ్డు వేస్తే రోడ్డుపై కందకం తవ్వుతామని ఈవిషయంలో సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని చక్రితండాకు చెందిన రైతులు బుధవారం రోడ్డు పనులకు కంకర, మొరంతో వచ్చిన లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. తండాకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతుంటే బీటీ రోడ్డు సౌకర్యం కల్పించడం హర్షనీయమే కానీ కల్వర్టు నిర్మించకుండా రోడ్డు వేస్తే వర్షాలకు బొంత గట్టు కాల్వనుంచి వచ్చే వరద నీటితో రైతులకు చెందిన 30 ఎకరాల పంటలు నీట మునుగుతాన్నారు. తమ ఇబ్బందులను అర్థం చేసుకోకుండా రోడ్డు వేస్తే వర్షాకాలంలో నీరు నిల్వకుండా రోడ్డుపై కందకం తీస్తామని ఈ విషయంలో తమపై కేసులు పెట్టినా భయపడమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఊరడి యాదగిరి, సాదం నాగరాజు, సాదం భీమయ్య, మల్లేష్, రాంచంద్రం, చేరాలు, సాంబరాజు, అయిలయ్య, లింగయ్య, గట్టయ్య, పోశయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల వితరణ



చిల్పూరు: చిల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెలో బుధవారం అయోధ్య రాములోరి అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ పిట్టల మహేందర్-సుమతి దంపతులు ప్రారంభించారు. మొదట హనుమాన్ ఆలయంలో అర్చకులు రవీందర్‌శర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు అనంతరం అక్షింతల కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ ఉడ్డెమారి రాజ్‌కుమార్, బొమ్మిశెట్టి బాలరాజు, జ్యోత్స్న, రమేష్, జంపయ్య, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జనగామ: చిన్ననాటి అల్లర్లు, తీపి జ్ఞాపకాలు గుర్తుకు చేసుకుంటూ ఆరు దశాబ్దాల స్నేహ మాధుర్యాన్ని పంచుకున్నారు. 59 ఏళ్ల తర్వాత మొట్ట మొదటి సారిగా కలుసుకున్న స్నేహితులు తమ ఆప్యాయతను వెలిబుచ్చారు. కొడుకులు, కోడళ్లు, మనువళ్లు, మనువరాళ్లు, వ్యాపారాలు, ఉద్యోగ బాధ్యతలు ఇలా కష్ట, సుఖాలను తెలుసుకుంటూ సాయంత్రం వరకు వేడుకలను జరుపుకున్నారు. జనగామ పట్టణ ఆంధ్రభాషాభివర్ధిని ఉన్నత పాఠశాలలో 1965–66 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జనగామ, హైదరాబాద్‌తో పాటు మైసూర్, కర్ణాటక, ముంబాయి తదితర ప్రాంతాల నుంచి 30 మంది పూర్వ విద్యార్థులు వచ్చారు. విద్యాబుద్దులు నేర్చుకున్న పాఠశాలకు వెళ్లి నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం సూర్యాపేట రోడ్డులోని బాంకెట్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో మాట్లాడుకుని, సత్కరించుకుని, గుర్తుగా జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పజ్జూరి గోపయ్య, డాక్టర్ మురళీ, మహేందర్‌రాజు, సాయిరాం, సుకుమారి, మానస, కమళ, వెంకట్‌రెడ్డి, మల్లయ్య, మధుసూధన్, రఘురాం, ఝాన్సీరాణి, రేణుక, సోమశేఖర్, పుల్లయ్య పాల్గొన్నారు.

జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుంటాం..



59 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత చిన్న నాటి మిత్రులంతా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఇందులో కొంతమంది స్నేహితులను 10వ తరగతి పూర్తి చేసుకున్న తర్వాత మొదటగా కలుసుకున్నాం. చదువుకున్న పాఠశాల తరగతి గదిలోకి వెళ్లగానే నాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. ఈ స్నేహాన్ని ఎప్పటికీ కంటిన్యూ చేస్తాం.

- పజ్జూరి గోపయ్య, పూర్వ విద్యార్థి

హ్యాపీగా ఉంది..



బిజీ జీవితంలో చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం హ్యాపీగా అనిపించింది. 70 ఏళ్ల వయస్సులో కూడా, మిత్రులు చూసీ సరికి, ఏదో కొత్త ఉత్సాహం వచ్చినట్టుగా రోజంతా కలిసి ప్రయాణం చేసినం. తరగతి గదిలో చేసిన అల్లర్లను సహచర స్నేహితులు ఎవరూ కూడా మరచి పోలేదు. మా ఆత్మీయ సమ్మేళనం చిన్ననాటి స్నేహాన్ని మరింత దగ్గర చేసింది.

- డాక్టర్ మురళీకృష్ణ, పూర్వ విద్యార్థి

గీత కార్మికులకు బైక్‌లు ఇవ్వాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

లింగాలఘణపురం: కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా బైక్‌లు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్దె వెంకటమల్లయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం భవనంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బస్వగాని మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటమల్లయ్య మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనగామకు సర్దార్ సర్వాయి పాపన్న పేరున నామకరణం చేయాలని, తాత్కాలికంగా వికలాంగులైతే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పెన్షన్ ప్రతి 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్, సమ్మయ్య, చిన్నస్వామి, కంఠం, సత్యనారాయణ, రాజు, వసంత్, తిరుపతి, అంజనేయులు, మల్లేశం పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న మెరిట్ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం జెడ్పీఎస్‌ఎస్‌లో 9వ తరగతి ఐదుగురు మెరిట్ విద్యార్థులు, 10వ తరగతి ఐదుగురు మొత్తం పది మందికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున రూ.10వేలు ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక చెక్కులను అందించారు. అనంతరం హెచ్‌ఎం బి.రఘుజీ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పీఎల్ నరేందర్ వారి మిత్రులు కలిసి ఉల్లాస్ ట్రస్టును ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ట్రస్టును ఏర్పాటు చేశారని, అందులో భాగంగా ఇప్పగూడెం జెడ్పీఎస్‌ఎస్‌లో 10 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారని తెలిపారు. ఉపాధ్యాయులు రాగమణి, శ్రీనివాసులు, రాజమౌళి, నాగార్జునరావు, పీఈటీ ప్రమోద్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వారాల రాజు, ఉల్లాస్ ట్రస్టు స్కూల్ కోఆర్డినేటర్ మాదిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీకేఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న సీఐ రాజు తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సట్ల రాజుగౌడ్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్యగౌడ్ బుధవారం ఆవిష్కరించారు. కేజీకేఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. కేజీకేఎస్ మండల కార్యదర్శి సట్ల రాజు, తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు, బత్తిని రమేష్, మాచర్ల భిక్షపతి, కత్తి శ్రీనివాస్, వంగ వేణు, ఆకుల ఎల్లయ్య, బత్తిని శ్రీను, వడ్లకొండ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: త్వరలో జరుగబోవు పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ సూచించారు. బుధవారం గిర్నితండా, మైదంచెరువుతండాల్లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మెజార్టీ కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని, త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు కొత్తగా పట్టభద్రులైన వారు ఓటరు నమోదు చేసుకోవాలని కోరారు. ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హేమానినాయక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు సుధీర్‌నాయక్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృతి



పాలకుర్తి: కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని స్టేషన్‌ఘనపూర్ రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు ఆంగోతు రవి తెలిపిన వివరాల ప్రకారం.. రవి ఇంటి పక్కన ఉన్న గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 30 మృతి చెందాయి. సూర్యాపేట జిల్లా తిర్మలగిరిలో గొర్రెలను రూ.3.80 లక్షలకు తీసుకొచ్చాడు. దాడిలో అవి మృతి చెందడంతో పూర్తిగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేశం, పశువుల డాక్టర్‌కు ఫిర్యాదు చేయగా వారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌చే విచారణ నిర్వహించి న్యాయం చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నాడు. ఇటీవల మండల కేంద్రంలోని రైతు చిలువేరు సోమయ్య 15 గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. కుక్కల బారి నుంచి రక్షించాలని బాధిత రైతులు కోరారు.